



వన్‌టౌన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

సమస్యలకు చెక్
● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆధునికీకరణ
7

భూ భారతి దరఖాస్తులను

పరిష్కరించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి దరఖాస్తులపై రెండు రోజులకు ఒకసారి మండలాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వ వసతిగృహాల తనిఖీ బృందాలను మండల పరిధిలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బృందంలో మండల ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి, సంబంధిత హాస్టల్ శాఖ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ బృందం సభ్యులు ప్రతివారం అన్ని హాస్టళ్లను సందర్శించాలని ఆదేశించారు. నెలకు ఒకసారి ప్రతి హాస్టల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్, అన్ని శాఖల అధికారులు వనమహోత్సవం కార్యక్రమంపై దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఎఫ్‌వో బాలామణి, డీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● దివ్యాంగులు సమస్యలు తెలుసుకునేందుకు సైన్ లాంగ్వేజీలో శిక్షణ

దివ్యాంగుల సమస్యల్ని, భావాన్ని అర్థం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించేందుకు సైన్ లాంగ్వేజి ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో అధికారులకు బేసిక్ ఇండియన్ సైన్ లాంగ్వేజీ శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను, వారి భావాన్ని సరిగ్గా అర్థం చేసుకునేందుకు సైన్ లాంగ్వేజీ ఉపకరిస్తుందన్నారు. జిల్లాలో మొదటి జిల్లాస్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ అందుల ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల, భవిత కేంద్రాలను అధికారులు సందర్శించాలన్నారు.

నేడు 'మహాలక్ష్మి' సంబరాలు

భగత్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మహాలక్ష్మి ఉచిత ప్రయాణాలు రెండు వందల కోట్లకు చేరుకున్నాయని కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 9 2003న ప్రవేశపెట్టినప్పటి నుంచి మహాలక్ష్మి పథకం కింద 200 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బుధవారం కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

● 25 నుంచి రేషన్ కార్డుల పంపిణీ
● పాల్గొననున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్
● ఆగస్టు 10 వరకు కొనసాగనున్న కార్యక్రమం
● జిల్లాలో 34,439 కొత్త కార్డులు



నిరీక్షణకు తెర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రేషన్‌కార్డుల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు మండలాల వారీగా కార్యక్రమాలను నిర్వహించి కార్డుల పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఈ పంపిణీ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో కూడా కొత్త రేషన్ కార్డుల కోసం, పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రజలకు సూచించింది. ఈ మేరకు వచ్చిన దరఖాస్తులన్నింటిని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అర్హులైన వారందరికి రేషన్‌కార్డులను మంజూరు చేశారు. పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను నమోదు చేశారు. ఈ కార్డులను ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో లబ్ధిదారులకు అందించనున్నారు. ఆన్‌లైన్‌లో ముద్రించిన కార్డులను ప్రస్తుతం అందరికి అందజేసి ఆ తర్వాత డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

● 47 వేల కార్డుల్లో కొత్త సభ్యుల నమోదు

కొత్తగా జిల్లాలో ఈ నెల 21 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుల మేరకు 34 వేల పైచిలుకు మందికి కొత్త రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. మరో 47 వేల కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు నమోదు చేసి ఇవ్వనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రకటించింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు.

● ఏళ్లుగా ఎదురుచూపులు

కొత్త రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడక ముందే రేషన్ కార్డుల జారీ నిలిచిపోయింది. వేలాదిమంది పలు విడతలుగా తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తూ వచ్చారు. ఉద్యమకాలంలో ఉన్న ప్రభుత్వం ఆనాటి రాజకీయ పరిస్థితుల్లో రేషన్ కార్డుల జారీ అంశాన్ని పరిశీలించే అవకాశం లేకుండా పోయింది. ఆ తర్వాత రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పదేళ్ల ప్రభుత్వాన్ని నిర్వహించింది. అయినా ప్రజల కొత్త రేషన్ కార్డుల ఆశలు తీరకుండా పోయాయి. రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన ఆ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీని పక్కనపెడుతూ వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి కొత్త రేషన్ కార్డుల జారీ కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. రెండు దశలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కానీ రేషన్‌కార్డుల జారీ మాత్రం పెండింగ్‌లోనే ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులతోపాటు ఆన్‌లైన్ దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుని క్షేత్రస్థాయి పరిశీలనచేసి అర్హులైనవారికి రేషన్‌కార్డుల జారీ చేయాలని నిర్ణయించారు.

● మండలాల వారీగా కార్యక్రమాలు

కొత్త రేషన్‌కార్డుల జారీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 14న లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఆ క్రమంలోనే ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు

(మిగతా 8వపేజీలో)

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలి..

● పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని సీపీ గౌస్‌ఆలం సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్ వన్‌టౌన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టౌన్ ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. కమిషనర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ సిబ్బందికి అందించిన కిట్లను తనిఖీ చేసి, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోలీసుఠాణా ఆవరణలోని స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో వినియోగించాలని ఆదేశించారు. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలోని అన్ని వార్డులను సెక్టార్లుగా, సబ్-సెక్టార్లుగా విభజించి, వాటికి పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు. రికార్డుల మెయింటనెన్స్, పోలీస్ స్టేషన్ పర్యవేక్షణ బాగుందని సీఐ బిల్లా కోటేశ్వర్, సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, రాజన్న, సుమన్, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవాభావం

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకంతో విద్యార్థులకు క్రమశిక్షణ, సేవాభావం పెంపొందుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో 300 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ తో నాయకత్వ లక్షణలు అభివృద్ధి చెందుతా యన్నారు. కళాశాలలో స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగించాలన్నారు. కార్యేక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పడాల తిరుపతి, కాంపల్లి అర్జున్, ఎలిజబెత్ రాణి, రాజేశం, రాపర్తి శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాజయ్య, పరీక్షల నియంత్రణ అధికారి టి శ్రీనివాస్, కిరణ్మయి కామాద్రి, వంగల శ్రీని వాస్, ఎండీ తాహిర్‌హుస్సేన్, తోట మహేష్ పాల్గొన్నారు.



ఎస్సారార్ కళాశాల ఎదురుగా కలుపు మొక్కలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులు

ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాలి

● జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కమలాకర్‌రెడ్డి

గంగాధర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులు దీర్ఘకాలిక లాభాలనిచ్చే ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కమలాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం గంగాధరలో ఉద్యాన పంటలు ఆయిల్ పాం, పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. అనంతరం గంగాధర రైతు వేదికలో డివిజన్ స్థాయి రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉద్యాన రైతులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,350 ఎకరాల్లో రైతులు ఆయిల్ పాం సాగు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, డివిజన్ ఉద్యాన అధికారి రోహిత్, ఏఈవోలు వేదిక, లోహియా, ఫీల్డ్ అధికారి శ్రవణ్ పాల్గొన్నారు.



పండ్ల తోటను పరిశీలిస్తున్న ఉద్యాన,పట్టు పరిశ్రమ అధికారి కమలాకర్‌రెడ్డి

● నిబంధనలు పాటించలేదనే విమర్శలు
● సరిగా చేయాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
● 123 మంది ఉపాధ్యాయులకు డిప్యూటేషన్లు



సర్దుబాటు సక్రమమేనా?

కరీంనగర్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు కొంత మంది ఉపాధ్యాయులను బదిలీలు చేశారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల మేరకు సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సర్దుబాటులో జరిగిన తప్పులను సరిదిద్దాలని కోరుతున్నారు.

● పెద్ద ఎత్తున పైరవీలు

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు ఎదురవుతున్న ఆటంకాలను చక్కదిద్దే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులకు ఈ నెల 15 నాటికి సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఉపాధ్యా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సిరఫార్సులతో అధికారులపై ఒత్తిడి తెచ్చారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 123 మంది ఉపాధ్యాయులను సర్దుబాటులో భాగంగా వివిధ మండలాల్లోని పాఠశాలలకు డిప్యూటేషన్, బదిలీ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఏటా విద్యార్థుల నిష్పత్తి ఆదారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. కొంత మంది ఉపాధ్యాయులు తమ పలుకుబడిని ఉపయోగించి ఎన్ని రకాలుగా ఒత్తిళ్లు తెచ్చినప్పటికి సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం పాఠశాల నుంచి పక్క పాఠశాల, కాంప్లెక్స్ నుంచి కాంప్లెక్స్, మండలం నుంచి మండలం, పక్క మండలాలు, జిల్లాలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. ఈ విధానంలో తొలి వరుసలో జూనియర్ ఉపాధ్యాయులు ఉంటారని అనుకుంటే సీనియర్ ఉపాధ్యాయులనూ సర్దుబాటు చేస్తామని చెప్పారు. ఇందుకు సంబందించిన ఎంఈవోల నుంచి ఉపాధ్యాయుల సమగ్ర సమాచారం సేకరించి సర్దుబాటు చేసినట్లు తెలిసింది. పాఠశాలల్లో ఆదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఈనెల 22 వరకు సర్దుబాటు చేయాలని ఆదేశించడంతో జిల్లాలో 123 మంది ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ బదిలీలు చేపట్టారు. హుజురాబాద్ డివిజన్ నుంచి కరీంనగర్ డివిజన్‌కు, ఒక మండలంలో ఉన్న వారిని వేరే మండలానికి, ఇద్దరు సబ్జెక్టు టీచర్లు ఉండాల్సిన చోట ఒకరిని బదిలీ చేశారని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి.

పల్లెల్లో పడకేసిన ప్రత్యేక పాలన

ప్రజలకు అందుబాటులో ఉండని అధికారులు

కరీంనగర్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో 17 నెలలగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఒక్కో గెజిటెడ్ అధికారికి మూడు నుంచి ఆరు పంచాయతీల బాధ్యతను ప్రభుత్వం అప్పజెప్పింది. సదరు అధికారి ఏ రోజు ఏ పంచాయతీలో ప్రజలకు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రత్యేకాధికారి, గ్రామ కార్యదర్శికి సంయుక్త చెక్ పవర్ ఇచ్చారు. కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా మూడు కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. ప్రస్తుతం 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. నిధులు లేక పంచాయతీల్లో కనీస పనులు చేపట్టడం లేదు. వీధి దీపాల విద్యుత్ బిల్లులు, పంచాయతీ ట్రాక్టర్ల ఈఎంఐలు పేరుకుపోతున్నాయి. వీధి దీపాలు కాలిపోయినా కొత్తవాటిని అమర్చలేని పరస్థితి నెలకొంది. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను రూపంలో వచ్చిన ఆదాయంతో కొంత మేరకు పనులు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందు తాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.



చర్లబూత్కూర్ గ్రామ పంచాయతీ భవనం

30 పడకల ఆసుపత్రిగా మారేనా?

● గుండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంపై మండలవాసుల ఆశలు
● ఆరు దశాబ్దాలుగా ఎదురు చూపులు

రామడుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల చరిత్ర ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. 30 పడకల ఆసుపత్రి కావడానికి అన్ని అర్హతలు ఉన్నా.. పాలకుల నిర్లక్ష్యంతో నిరాదరణకు గురవుతోంది. రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేటలో 1962 నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇక్కడ వైద్యసేవలు బాగుంటాయని చుట్టుపక్కల మండలాల నుంచి సైతం ప్రజలు వస్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ రెండు బెడ్లు మాత్రమే ఉండగా ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు 60 నుంచి 100 మంది, వర్షాకాలంలో 150మందికిపైగా ఇక్కడ ప్రతిరోజు చికిత్స పొందుతున్నారు. వైద్యులు, సిబ్బంది కూడా అందుబాటులో ఉండి అన్ని రకాల చికిత్స చేస్తుంటారు. గోపాల్‌రావుపేట గ్రామం 25 గ్రామాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి తగిన స్థలం, వనరులు ఉన్నాయి. ప్రతి ఎన్నికలకు ముందు గోపాల్ రావుపేట పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నారు. ఆ ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వీణవంక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలోని గొల్లపల్లికి చెందిన ఎనగంటి చంద్రయ్య(53) కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. చంద్రయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో కడుపునొప్పి భరించలేక ఈనెల19న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్టు తెలిపారు. మృతుడు చంద్రయ్య భార్య ఎనగంటి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

ద్విచక్రవాహనం కొనివ్వలేదని విద్యార్థి బలవన్మరణం

వీణవంక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చుక్క ఆదిత్య(17) తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదని పురుగుల మందుతాగాడు. చికిత్సపొందుతూ ఆస్పత్రిలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిత్య ఇల్లందకుంట మండలం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవతరగతి చదువుతున్నాడు. ఈనెల 18వతేదిన సెలవులకు తనకు ద్విచక్రవాహనం కొనివ్వాలని తల్లిదండ్రులను అడిగాడు. కొద్ది రోజుల తర్వాత కొనిస్తానని తల్లిదండ్రులు చెప్పారు. దీనికి ఒప్పుకోక ఆదిత్య 20వ తేదిన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మంగళవారం మృతిచెందినట్టు తెలిపారు. మృతుడు ఆదిత్య తండ్రి చుక్క సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య


అభిలాష్(ఫైల్)

జూలపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన అంగరి అభిలాష్(27) అనే యువకుడు మద్యం మత్తులో గడ్డి మందుతాగి మృతిచెందాడు. అంగరి రాజేశం మల్లమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు అభిలాష్ ఉన్నాడు. అభిలాష్ మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానుకోవాలని తల్లిదండ్రులు అభిలాష్‌కు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఈక్రమంలో ఈనెల 20న రాత్రి మద్యం మత్తులో అభిలాష్ గడ్డి మందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు వైద్యంకోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి మెరుగైనవైద్యంకోసం కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తుండగానే సోమవారం రాత్రి అభిలాష్ మృతిచెందినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యా దుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సుమన్(ఫైల్)

ఎలిగేడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అనగోని సుమన్(38) పురుగుల మందుతాగి చికిత్సపొందుతూ సోమవారంసాయంత్రం మృతిచెందాడు. కొన్నేళ్లుగా మద్యానికిబానిసగా మారిన సుమన్ ఈనెల20న వనభోజనాలకు వెళుతామని చెప్పాడని, అనంతరం మద్యం మత్తులో గడ్డి మందుతాగినట్లు భార్యకు తెలిపాడన్నారు. అతడిని చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి,అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


యశ్వంత్ (ఫైల్)

జ్యోతినగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్రాజెక్టుమెటీరియల్ గేట్‌సమీపంలో రాజీవ్‌రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో బోయిని యశ్వంత్(19) మృతిచెందాడు. యశ్వంత్ రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనంది. తీవ్రంగా గాయపడిన యశ్వంత్‌ను గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం చనిపోయాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంతటి బరువైనా ఎత్తేస్తారు..



● ప్రతిభ చాటుతున్న పవర్ లిఫ్టర్లు
● ఏషియన్ యూనివర్సిటీ చాంపియన్ షిప్‌లో పతకాలు



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్‌లో వారి ప్రతిభ ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటింది. వందల కేజీలను ఎత్తడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈ విద్యార్థినులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులు తుడి సిరిచందన, శ్యామ్‌రావు ఐశ్వర్య, కుమ్మరి పూజిత ఇటీవల జరిగిన ఏషియన్ యూనివర్సిటీ కప్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని పతకాలను సాధించారు.

ప్రపంచ చాంపియన్‌షిప్ లక్ష్యంగా...


తుడి సిరిచందన

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధ్రిగడ్డ గ్రామానికి చెందిన తుడి శ్రీనివాస్-గంగమ్మ దంపతుల కూతురు తుడి సిరి చందన. ఆమె ప్రతిభను గుర్తించిన కోచ్ బొమ్మ నాతిని మల్లేశం పవర్ లిఫ్టింగ్‌లో ప్రోత్సహించాడు. పది సంవత్సరాల క్రితం పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణను ప్రారంభించిన సిరిచందన అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించింది. ఎనిమిది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం, కేరళలో తృతీయ స్థానం, మహారాష్ట్రలో నాలుగో స్థానం, రాజస్థాన్, ఝూర్ఖండ్, పంజాబ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ జూని యర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. మే నెలలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. ఏషియన్ యూనివర్సిటీ చాంపి యన్‌షిప్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఆరు సంవత్సరాల సాధన


శ్యామ్‌రావు ఐశ్వర్య

జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన సత్యం-వాణి దంపతుల కుమార్తె శ్యామ్‌రావు ఐశ్వర్య. చిన్ననాటి నుంచి ఆమె క్రీడలు అంటే ఇష్టం. ఈమె అభిరుచిని క్రీడల్లో ఉన్న ఇష్టాన్ని గుర్తించిన తల్లిదండ్రులు పవర్ లిఫ్టింగ్‌లో ప్రోత్సహించారు. ఫలితంగా ఐశ్వర్య పవర్ లిఫ్టింగ్‌లో ఆరు సంవత్సరాలుగా ప్రతిభ చాటుతూ ముందుకు సాగుతోంది.

తెలంగాణలోని సనత్‌నగర్, రామచంద్రాపూర్, మేడ్చల్, ఎల్బీ స్టేడియం, రంగారెడ్డి తదితర ప్రాంతాల్లో జరిగిన పది రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పలు పతకాలను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. జార్ఖండ్, తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటకలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగో స్థానాల్లో నిలిచింది. పంజాబ్‌లో జరిగిన పోటీల్లో వ్యక్తిగత విభాగంలో మూడో స్థానం సాధించింది. మే నెలలో జరిగిన జూనియర్ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. డెహ్రా డూన్‌లోనే జరిగిన ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. భవిష్యత్‌లో ఒలింపిక్స్‌లో భారత పవర్ లిఫ్టింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన లక్ష్యంగా ఐశ్వర్య ముందుకు సాగుతుంది.

తిరుగులేని పూజిత...


కుమ్మరి పూజిత

జగిత్యాల జిల్లా కమలాపూర్‌కు చెందిన కుమ్మరి రాజన్న-కవిత దంపతుల కూతురు పూజిత. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆమె ఆరు సంవత్సరాలుగా పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతుంది. రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో ఏడు బంగారు, ఐదు రజత, మూడు కాంస్య పతకాలు సాధించింది. పలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన చీఫ్ మినిస్టర్స్ కప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. మే నెలలో జరిగిన అంతర్జాతీయ జూనియర్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఏషియన్ యూనివ ర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించింది. మున్ముందు రైల్వేస్, ఇండియన్ ఎయిర్ లైన్స్, బ్యాంక్స్‌లాంటి సంస్థల్లో ప్రవేశించి అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే లక్ష్యమని తెలిపింది పూజిత.

బాలుడితో పని చేయిస్తున్న యజమానిపై కేసు

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికుడితో బ్రిక్స్ ఇండస్ట్రీలో పనులు చేయిస్తున్న చందుపట్ల సుధాకర్ రెడ్డిపై గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ముస్కాన్ బృందం మంగళవారం గోదావరిఖని శివారులోని శ్రీలక్ష్మీ బ్రిక్స్ ఇండస్ట్రీని తనిఖీ చేశారు. సదరు పరిశ్రమలో ఒడిశాకు చెందిన 16 ఏళ్ల బాలుడు పనిచేయడాన్ని గుర్తించి యజమానిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మెరుగు శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. లేబర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు బ్రిక్స్ ఇండస్ట్రీ యజమాని సుధాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

గొల్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామ రెవెన్యూ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని తనిఖీ చేయగా 90 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్ రెడ్డి మంగళవారం తెలిపారు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన మనోజ్(20) అనే యువకుడు గంజాయి తరలిస్తు పట్టుబడగా అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మనోజ్‌తో ఉన్న మరో యువకుడు సంఘటనాస్థలి నుంచి పారిపోగా, అతడికోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

బాలికల జూనియర్ కళాశాలలో చోరీ

జగిత్యాల క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో చోరీ జరిగింది. దొంగలు విద్యార్థులకు సంబంధించిన నోట్ పుస్తకాలను అపహరించుకు వెళ్లారు. తరగతి గదుల్లోని ట్యూబ్ లైట్లతో పాటు ఫ్యాన్లను ధ్వంసం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి రామగుండం కాంగ్రెస్ నాయకుడు మహంకాళిని కించపరిచే విధంగా వీడియోలను పోస్టుచేసిన కేసులో రామగుండం ఎన్‌టీపీసీకాలనీకి చెందిన జరుపుల శ్రీనివాస్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాస్ గతంలో ఒక ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌లో పనిచేసేవాడని, అనంతరం ఒక రాజకీయపార్టీలో క్రియాశీలకంగా పని చేశాడన్నారు. అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటూ సోషల్ మీడియాలో గ్రూపులను క్రియేట్ చేసి ఆపరేట్ చేస్తున్నాడన్నారు. సోషల్‌మీడియాలో అనవసరమైన పోస్టులు పెడుతూ రెండు రాజకీయపార్టీల మధ్య ఘర్షణలకు దారి తీసేలా ప్రయత్నించాడన్నారు. రామగుండం జనహిత, పాలకుర్తి మండలం, నిజం నిప్పులాంటిది పేర ఫేస్‌బుక్‌లో అకౌంట్ క్రియేట్‌చేసి కించపరిచే పోస్టులు పెట్టాడన్నారు. మహంకాళి స్వామి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి మంగళవారం నిందితుడిని అరెస్టు చేశామన్నారు. సోషల్ మీడియాను మంచి సమాచారానికి వినియోగించేలే తప్ప అసత్యప్రచారాన్ని పోస్టు చేసేందుకు వినియోగించరాదన్నారు. అలాంటి పోస్టులు పెట్టేవారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఒకరి రిమాండ్

జగిత్యాల క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకుని పెళ్లి కోసం బాలికను కిడ్నాప్ చేసిన కేసులో యువకుడికి జగిత్యాల కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. బీర్‌పూర్ మండలానికి చెందిన ఓ బాలికను జిల్లా కేంద్రానికి చెందిన నవీద్‌ఖాన్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. పెళ్లి పేరుతో ఈనెల 20న కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకువెళ్లాడు. పోలీసులుకిడ్నాప్‌నకు పాల్పడ్డ యువకుడిని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ వివరించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

● పీజీ మెడికో దుర్మరణం ● మరో నలుగురికి గాయాలు
● జూబ్లీనగర్ ఎల్లమ్మ గుడి వద్ద ఘటన


రాహుల్‌రామిరెడ్డి(ఫైల్)


బోల్తాపడిన కారు

కరీంనగర్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ ఓ పీజీమెడికోను బలిగొనగా, మరోనలుగురు మెడికోలు గాయపడ్డారు. కరీంనగర్‌లోని చామనపల్లి-జూబ్లీనగర్‌లోని ఎల్లమ్మటెంపుల్ మధ్య ప్రమాదకరమైన మూలమలుపు ఉంది. ఈ దారిలో నెమ్మదిగా వెళ్లాలి. పీజీవిద్యార్థులు ఎప్పటిలాగే రోడ్డు బాగా ఉందనుకొని వేగంగా వెళ్లారు. మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో నుంచి కిందపడిన సమయంలో ఏటూరి రాహుల్‌రామిరెడ్డి అనే పీజీమెడికో తలకు బండతగలడంతో తీవ్రగాగాయపడి మృతిచెందాడు. మిగతావారికి స్వల్పగాయాలయ్యాయి. గంటకు 60కిలోమీటర్లపైన వేగంఉన్న సమయంలో ప్రమాదం జరిగితే ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకుంటాయి. ప్రమాదానికి గురైన ఈ కారులో ఎయిర్‌బ్యాగ్‌లు తెరచుకోలేదు. కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. కరీంనగర్‌రూరల్ మండలం చామనపల్లి-జూబ్లీనగర్ మధ్య రోడ్డుపై కారు అదుపుప్పి బోల్తాపడిన ఘటనలో ప్రతిమ వైద్యకళాశాలలో పీజీ చదువుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన ఏటూరి రాహుల్‌రామిరెడ్డి(24) దుర్మరణం చెందాడు. కారులోప్రయాణిస్తున్న మరోనలుగురు పీజీ విద్యార్థులకు గాయాలయ్యాయి. కడపకు చెందిన ఏటూరి రాహుల్‌రామిరెడ్డి, గుంటూరులోని శ్యామలనగర్‌కు చెందిన మోపిదేవి జయంత్, కర్ణాటకలోని రాయ్‌చూర్ జిల్లా చిందంటౌన్‌కు చెందిన కడియ వినయ్‌చౌదరి, హైదరాబాద్ ఎల్‌బీనగర్‌కు చెందిన ఎం.పృథ్వీరాజ్, సిద్దిపేటలోని మోయిన్‌పురకు చెందిన బి.పృథ్వీరాజ్ కరీంనగర్‌లోని ప్రతిమ వైద్యకళాశాలలో పీజీ మొదటిసంవత్సరం చదువుతున్నారు. వీరంతా నగునూర్‌లోని కళాశాల హాస్టల్‌లోనే ఉంటున్నారు. సోమవారం సెలవుకావడంతో ఐదుగురు ఎక్స్‌యూవీ-700 కారు(కేఏ 36 జెడ్ 3980)లో ఉదయం 10గంటలకు బొమ్మకల్ శివారులోని చల్మెడ వైద్యకళాశాలలో స్నేహితులను కలిసేందుకు వెళ్లారు. తిరిగి అదేకారులో రాత్రి 1:30గంటలకు ప్రతిమ కళాశాలలోని హాస్టల్‌కు బయలుదేరారు. జూబ్లీనగర్ ఎల్లమ్మ దేవాలయం వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టును ఢీకొని బోల్తాపడింది. దీంతోకారులో వెనుకవైపున కూర్చున్న రాహుల్‌రామిరెడ్డి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న జయంత్‌తోపాటు మిగతాస్నేహితులకు స్వల్పగాయాలయ్యాయి. వారంతా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. అతివేగం, అజాగ్రత్తగా కారు నడపడంతోనే ప్రమాదం జరిగిందని ఏటూరి రాహుల్‌రామిరెడ్డి సోదరి పోలీసులకు ఇచ్చినఫిర్యాదులో పేర్కొన్నట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

నీటి గుంతలో పడి కార్మికుడి మృతి

పెగడపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం నందగిరి గ్రానైట్ క్వారీలో మంగళవారం ఉదయం నీటి గుంతలో పడి కార్మికుడు సాని (19) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన సాని మండలంలోని నందగిరి శివారులోని మైత్రి గ్రానైట్ క్వారీలో పనిచేస్తూ మంగళవారం ప్రమాదవశాత్తు క్వారీలోని నీటి గుంతలో పడి మృతి చెందాడు. మృతుని అన్న సోమా ఫిర్యాదు మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

నీటి సంపులో పడి వృద్ధురాలు మృతి

తంగళ్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు చెన్నం బాలవ్వ(82) నీటి సంపులో పడి మృతి చెందింది. మంగళవారం తెల్లవారు జామున ఇంటి పనులు చేస్తూ బాలవ్వ ఇంటి ముందు ఉన్న నీటి సంపులో నుంచి నీటిని తోడే క్రమంలో సంపులో పడి మృతి చెందింది. బాలవ్వ నీటి సంపులో పడి ఉండడాన్ని గమనించిన భర్త బాపురెడ్డి స్థానికుల సహాయం కోరడంతో గమనించగా అప్పటికే బాలవ్వ మృతి చెందింది. ఈ సంఘనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలుడు పదార్థాల పట్టివేత

● ముగ్గురిపై కేసు నమోదు


పట్టుబడిన వ్యక్తులతో సీఐ నటేశ్, ఎస్సై గణేశ్

ముస్తాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలను పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై గణేశ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. నందిపేట గ్రామానికి చెందిన గడపర్తి శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి తన యజమాని ఓర్సు సాయిమల్లు ఆదేశాల మేరకు తన టాటా వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు తీసుకువచ్చి నామాపూర్ గ్రామంలో గల శివరాత్రి రాజు అనే వ్యక్తికి బండ పనుల నిమిత్తం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నటేశ్ ఆధ్వర్యంలో దాడులు చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌రావు, శివరాత్రి రాజు, ఓర్సు సాయిమల్లు అనే ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


విద్యుదాఘాతానికి గురై తీగపై వేలాడుతున్న వంశీ

జగిత్యాలరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన ఇరుగదిండ్ల వంశీ(25) అనే యువకుడు ప్రమాదవశాత్తు 11కెవి విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మంగళవారం మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం వంశీ అనే యువకుడు గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన ఇంటి పైన బట్టలు ఆరవేసేందుకు మంగళవారం బిల్డింగ్ ఎక్కాడు. బట్టలు ఆరవేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ పక్కనగల 11 కేవీ విద్యుత్ వైర్లు వంశీకి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజు సైతం సంవత్సరం క్రితం చేపల వేటకు వెళ్లి చేపలు పడుతుండగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడి పెద్దనాన్న ఇరుగదిండ్ల సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

సొంత భవనాలకు మోక్షం ఎప్పుడు?

● అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ● స్థలం ఉన్నా నిర్మించని వైనం ● మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు.. అయినా నిర్మాణాల ఊసే లేదు


ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్(ఫైల్)

గన్నేరువరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు అయినా ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలకు నోచుకోవడం లేదు. పరిపాలనా సౌలభ్యం కోసం మండలాలను ఏర్పాటు చేయడం బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యలయాల భవనాలు, మౌళిక సదుపాయాలను కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో తహసీల్దారు కార్యాలయాన్ని అద్దెభవనంలో నిర్వహిస్తుండగా, ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌లోని కొన్నిగదులలో మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవనంలో పోలీస్‌స్టేషన్‌ను కొనసాగిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని రైతువేదికలో నిర్వహిస్తున్నారు. ఇందులో కొన్ని ఇరుకైన భవనాలు కాగా, కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నప్పటికీ విధులు నిర్వర్తించడం తప్పడం లేదంటూ కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రభుత్వ స్థలంలో నిర్మించేందుకు ఇటీవలే నిర్మాణపనులను ప్రారంభించారు. నిత్యం వందలాది మంది వివిధ అవసరాల కోసం మండల కేంద్రానికి వస్తుంటారు. వారికి అవసరమయ్యే కార్యాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అడిగి తెలుసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

మండల కేంద్రానికి చెందిన జువ్వాడి మన్‌మోహన్‌రావు మండలకేంద్రంలో పోలీస్‌స్టేషన్ కోసం ఎకరం పదిగుంటలు, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల కోసం 30గుంటలు మొత్తం రెండుఎకరాల భూమిని ప్రభుత్వానికి విరాళంగా అందించారు. మండలం ఏర్పడిన కొద్దిరోజులకే ఈ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల పేరిట మన్ మోహన్‌రావు రిజిస్ట్రేషన్ చేయించినా నేటికీ నిర్మాణాల ఊసేలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకొని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించి, అన్ని సౌకర్యాలు కల్పించి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించడంతో పాటు బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి మర్రిపెల్లి సాయినాథ్(24) అనే యువకుడు 2021లో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ శ్రీను, ఎస్సై రవీందర్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు రంజిత్, రాజు, శ్రీధర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ రావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కవ్వంపల్లి రాములు



సుభాష్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా కవ్వం పల్లి రాములును నియమిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాములు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఏకాగ్రత ముఖ్యం

భగత్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవింగ్‌లో ఏకాగ్రత ముఖ్యమని ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ అన్నారు. మంగళవారం బస్‌స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో డ్రైవర్ల రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కరీంనగర్ రీజియన్‌లో ప్రమాదాలు రేటు గణనీయంగా తగ్గిందన్నారు. డ్రైవర్లు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలన్నారు. మద్యానికి దూరంగా ఉండడం, సమతుల ఆహారం తీసుకోవడం, వేగ నియంత్రణ పాటించడం వంటి పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు ఎస్. భూపతిరెడ్డి, జి. సత్యనారాయణ, సైకాలజిస్టు నాగేశ్వర్‌రావు, కరీంనగర్ ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఆహ్లాదకరం

నరసింహుడి క్షేత్రం



గుట్టపై పచ్చదనం

భక్తులను ఆకర్షిస్తున్న నల్లగొండ ఆలయం

పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న భక్తులు

కొడిమ్యాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన గుట్టపైనున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆహ్లాదకరంగా ఉండి భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతోంది. శ్రావణ మాసంలో ఎగువ, దిగువ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. చుట్టూ పచ్చని పొలాలు, చెట్లతో వందలాది ఎకరాల విస్తీరణంతో నల్లని గుట్ట ఆవరించి ఉన్నది. భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. గుట్ట పైన ఆలయం సమీపంలో విశాలమైన పరుపు బండ, వాహనాల పార్కింగ్‌కు అనుకూలంగా ఉన్నది. కింది ఆలయం నుంచి గుట్టపైకి ఫార్మేషన్ రోడ్డు ఉన్నప్పటికీ నర్సింహస్వామికి మొక్కుకున్న భక్తులు మెట్ల మార్గం ద్వారా పైకి నడుచుకుంటూ వెళ్లి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. ఆలయం ముందు కోనేరులో నీరు ఎప్పుడూ ఉంటుంది. కింది ఆలయ పరిసరాల్లో 16 వసతి గదులు ఉన్నాయి. 1969 లో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడి పల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకొని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయటానికి కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.. ప్రతి ఏడు మాఘ మాసంలో నిర్వహించే బ్రహ్మోత్స వాలకు వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనాన్ని చేసుకుంటారు. ప్రతి మాఘ పౌర్ణమికి స్వామి వారి రథోత్సవం వైభవంగా జరుగుతుంది. గుట్ట కింద వర్షాకాల ప్రారంభ సమయంలో పరిసర గ్రామాల ప్రజలు వన భోజనాలు చేస్తారు.



గుట్ట కింద ఉన్న పచ్చని పొలాలు



నర్సింహస్వామి వెలసిన ఎత్తైన గుట్ట

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్,జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల (అటానమస్) కరీంనగర్‌లో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఖాళీల వివరాలను వెల్లడించారు. తెలుగు-5, ఇంగ్లీష్-8, కామర్స్-2, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ -6, బీబీఏ-3, బిజినెస్ ఎనలిటిక్-2. బీకాం ఫైనాన్స్-1, బీకాం రిటైలింగ్-1, డాటా సైన్స్-1, బీసీఏ-2, ఫిషరీస్-1, స్టాటిస్టిక్స్-1, క్రాప్ ప్రొడక్షన్-1, మైక్రోబయాలజీ-1, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్-1, ఎకనామిక్స్-1, పొలిటికల్ సైన్స్-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, జువాలజీ-1, బోటనీ-1, ఫుడ్ సైన్స్ క్వాలిటీ కంట్రోల్-1 చొప్పున ఖాళీలు ఉన్నట్లు వివరించారు. కమిషనర్ ప్రొసీడింగ్స్ ఆదేశాలకు లోబడి, పోస్టు గ్రాడ్యూయేషన్‌లో 55 శాతం మార్కులు, నెట్, సెట్, పీహెచ్‌డీ, టీచింగ్‌లో అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటల లోపు ఎస్సారార్ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 2025-26 విద్యా సంవత్సరం గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు.తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్, వృక్షశాస్త్రం, జంతు శాస్త్రం, మైక్రో బయాలజీ, ఫిజిక్స్ స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 25 సాయంత్రం 5 గంటలలోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 26వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు

తాళం వేసిన ఇంట్లో చోరీ

వీర్నపెల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంటి తాళం పగుల గొట్టి చోరీ చేసిన ఘటన మద్దిమల్లలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిమల్ల గ్రామానికి చెందిన చందనపు బ్రహ్మయ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగుల గొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తొమ్మిది గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి, రూ30 వేలు చోరీకి గురైనట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

కానిస్టేబుళ్లకు టెక్నాలజీపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై దశలవారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీపీ గౌస్ ఆలం తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక శిక్షణతోపాటు, టెక్నాలజీపై పట్టు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. వారం రోజుల శిక్షణలో భాగంగా, పిటిషన్ డ్రాఫ్టింగ్ నుంచి ఛార్జిషీట్ దాఖలు వరకు పలు అంశాలపై ఉంటుందని వివరించారు. నేరాల ఛేదనలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు విజయ కుమార్, వేణుగోపాల్, ఐటీ కోర్ కార్యాలయ సీఐ సరిలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల సబ్ జూనియర్ బాక్సింగ్ క్రీడకారుల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలకు రెండు జిల్లాల నుంచి 80 మంది హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హైదరాబాద్‌లోని షేక్‌పేటలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. పోటీల నిర్వహణను ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, కొత్తకొండ సంపత్ కుమార్ పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, తహసీల్దార్ మడిపల్లి కాళీచరణ్, సీనియర్ క్రీడాకారులు ప్రవీణ్, మురళి, రంజిత్, రాజేందర్, కోచ్ రామకృష్ణ అభినందించారు.



రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన కరీంనగర్, పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ జిల్లా నుంచి బాలుర విభాగంలో ఎం.సాయిదత్తు, శశివదన్, మహేష్, టి.రాహుల్, ఆర్.అఖిల్, కె.రితేష్, జోషిత్, భరద్వాజ్, దుర్గరాజు, అఫ్రిది, సయ్యద్ జమీల్ అహ్మద్, ఆది ఆర్యాన్, బాలికల విభాగంలో జి. హరిణి, మడిపల్లి నక్షత్ర ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా నుంచి కె.సూర్య ప్రతాప్, సీహెచ్ జస్వంత్, అద్విత్, శివ, ఒ.సాయి విక్రమ్, ఎం.కృష్ణ, రేవంత్, ఎం.అజయ్ కుమార్, సీహెచ్ అశ్విత్, రుక్షిత్, టి.సాహిల్, బాలికల విభాగంలో కె.అక్షర, బి.రిషి, చరణ, పి.వర్షిత ఎంపికయ్యారు.

నీటి కోసం రైతుల రాస్తారోకో



కథలాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

కథలాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వరద కాలువకు కాళేశ్వరం నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కథలాపూర్‌లో రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. కథలాపూర్, బొమ్మెన, దూలూరు, చింతకుంట, భూషణరావుపేట, సిరికొండ, దుంపెట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల నుంచి వందలాదిగా రైతులు మండల కేంద్రానికి తరలివచ్చి ఆందోళన చేపట్టారు. ప్రాజెక్ట్‌ల్లో నీరు ఉన్నప్పటికీ వరద కాలువకు నీటిని పంపింగ్ చేయడం లేదని ఆరోపించారు.

ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పంటలు కళ్ళ ముందే ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్ వినోద్, సీఐ సురేశ్‌కుమార్ రైతులను సముదాయించే ప్రయత్నం చేసినా రైతులు వినక పోవడంతో ఆర్డీఓ జివాకర్‌రెడ్డితో రైతు నాయకులను ఫోన్‌లో మాట్లాడించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతానని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, గడ్డం భూమారెడ్డి, పిడు గు ఆనందరెడ్డి, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు



మెట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

మెట్‌పల్లి రహదారిపై..

మెట్‌పల్లిటౌన్: సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం మెట్‌పల్లిలో జాతీయ రహదారిపై, ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మెట్‌పల్లి పట్టణంతో పాటు మెట్‌పల్లి మండలంలోని వెల్లుల, బండలింగాపూర్, పెద్దాపూర్, రేగుంట, ఇబ్రహీంపట్నం గ్రామాలకు చెందిన రైతులతో పాటు రైతు సంఘం నాయకులు పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. మెట్‌పల్లి సీఐ అనిల్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐలు కిరణ్ కుమార్, అనిల్‌లు రైతుల వద్దకు చేరుకొని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అన్నవరం దేవేందర్

కరీంనగర్ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కవి అన్నవరం దేవేందర్ రాష్ట్ర ప్రభుత్వ దాశరథి కృష్ణమాచార్య సాహిత్య పురస్కారం అందుకున్నారు.మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తెలంగాణ మట్టి పరిమళాన్ని ప్రపంచ వ్యాప్తంగా తన కవిత్వంతో పరివ్యాప్తం చేస్తున్న కవి అన్నవరమని కొనియాడారు. అనంతరం అన్నవరం మాట్లాడుతూ దాశరథి ధిక్కార స్వరాన్ని అందిపుచ్చుకొని అమానవీయ పరిస్థితులపై కవిత్వాన్ని రాస్తున్నట్లు చెప్పారు. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన నిపుణుల కమిటీకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి



గంగాధర, జూలై22 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులపై సీఎంతో చర్చించినట్లు ఆయన తెలిపారు. కొండగట్టు అంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి, నారాయణపూర్ రిజర్వాయర్‌ను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

భూతగాదాలో యువకుడిపై దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఇబ్రహీంపట్నం, జూలై22 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఇబ్రహీంపట్నం మండలం మూల రాంపూర్ గ్రామానికి చెందిన గూడ రవి(36)పై గూడ గంగాధర్ దాడి చేయడంతో సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై అనిల్ కథనం ప్రకారం గూడ గంగాధర్, గూడ రవిలు బంధువులు కాగా వీరికి గ్రామంలోని 12గుంటల వ్యవసాయ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 9న గూడ గంగాధర్ తన పొలంలో ఒడ్డు చెక్కుతుండగా అక్కడికి వచ్చిన రవి తన పొలంలో హద్దు దాటి ఒడ్డు చెక్కుతున్నావని ప్రశ్నించగా గొడవ మొదలైంది. గంగాధర్ చేతిలో ఉన్న పారతో రవిపై దాడిచేయగా తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం నిజామాబాద్‌లో మృతిచెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలకు చెక్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆధునికీకరణ

ఇన్వర్టర్లు, కంప్యూటర్లు, ఇతర పరికరాల ఏర్పాటు

తిమ్మాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చి పెట్టడంలో రిజిస్ట్రేషన్ శాఖ ముందు వరుసలో ఉంటుంది. అలాంటి శాఖకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో కావల్సి వసతులు లేవు. రాష్ట్రప్రభుత్వం ఈ శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయకు నూతన కంప్యూటర్లు, ప్రింటర్లు, విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధిక సామర్థ్యం ఉన్న ఇన్వర్టర్లును ఏర్పాటు చేస్తోంది.



తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం

రోజురోజుకు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో క్రయ విక్రయ దారులతో కిక్కిరిసిపోతోంది. విద్యుత్, ఇతర సమ స్యలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. కంప్యూటర్లు, ఇతర పరికారాలు పాతబడిపోవడంతో పనులు త్వరగా అయ్యేవి కావు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు అసహనం వ్యక్తం చేసేవారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే తిరిగి వచ్చే వరకు పనులకు అంతరాయం ఏర్పడేది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నూతన కంప్యూటర్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడిన పనులకు ఇబ్బంది కలగకుండా ఇన్వర్టర్లు, పెద్ద మొత్తంలో బ్యాటరీలను అమర్చుతోంది.



కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇన్వర్టర్, బ్యాటరీలు

కంప్యూటర్లు, ఇతర పరికరాలు బిగించారు

పార్థసారథి, సబ్ రిజిస్ట్రార్, తిమ్మాపూర్



రాష్ట్రంలో అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. దీనిలో భాగంగా తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయా నికి నూతనంగా ఆరు కంప్యూటర్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఇన్వర్టర్లు, బ్యాటరీలు, ఇతర పరికరాలను మంజూరు చేసింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఇన్వర్టర్ల ద్వారా పనులు పూర్తి చేస్తున్నాం. గతంలోలాగా ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంలో ఎక్కువ సేపు వేసి చూడల్సిన పరిస్థితి లేదు.

ఈ నెల 27న రాజన్న కోడెల పంపిణీ

వేములవాడ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలలోని కోడెలను ఈ నెల 27వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఈవో రాధాబాయి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 200 కోడెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఆనుకుని ఉన్న జిల్లాలోని చిన్న, సన్నకారు అర్హులైన రైతులకు అందిస్తామని స్పష్టం చేశారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డ్‌తో పాటు సరైన ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కోడెల పంపిణీ రోజున సరైన ధ్రువ పత్రాలతో రావాలని సూచించారు. అర్హులైన రైతులకు జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.



భక్తులు వెళ్లే క్యూలైన్‌లో అడ్డుగా పడుకున్న కుక్క

రాజన్న ఆలయం వెలవెల

ఆషాఢంలో తగ్గిన భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయం మంగళవారం భక్తులు లేక వెలవెలబోయింది. ఆషాఢ మాసం కావడంతో రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ కనిపించలేదు. దీంతో ఆలయ ఆవరణ ఎక్కడ చూసినా బోసి పోయి కనిపించింది. క్యూలైన్‌లు ఖాళీగా దర్శన మిచ్చాయి. రానున్న శ్రావణమాసంలో భక్తుల రద్దీ పెరుగనుంది.

క్యూలైన్‌లో శునకాలు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. భక్తులు విడిది చేసే స్థలాల్లో, క్యూలైన్‌ల వద్ద సంచరించడంతో భక్తులు భయాందోళనకు గురువుతున్నారు. దర్శనానికి వెళ్లే క్యూలైన్‌లో, లడ్డూలు తీసుకునే క్యూలైన్‌లో శునకాలు ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



భక్తులు లేకవెలవెల బోతున్న రాజన్న ఆలయం

చేతిపంపునకు మరమ్మతు చేపట్టరూ..



అన్నారంలో పనిచేయని చేతిపంపు

మానకొండూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారంలో చేతిపంపు పనిచేయక నెలలు గడుస్తున్నా అధికారులు మరమ్మతు చేపట్టడడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ బోరుపై సుమారు వంద కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, రోజూ అవసరాలకు నిత్యం నీటిని తీసుకెళ్లామని తెలిపారు. మూడు నెలలుగా నీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై మురికి నీరు



మానకొండూర్‌లో ప్రవహిస్తున్న మురికినీరు

మానకొండూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై మురికినీరు ప్రవహిస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానరహదారి పక్కన మురికి కాల్వలేకపోవడంతో ఇళ్లల్లో వాడుకున్న నీరు, వర్షం నీరు రోడ్డు పక్కన ప్రవహిస్తోంది. వాహనాలు వెళ్లే సమయంలో కాలినడకన వెళుతున్న వారిపై మురికినీరు పడుతోందని వాపోతున్నారు. మురికి కాలువ నిర్మించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

25 నుంచి రేషన్ కార్డుల పంపిణీ

(5వ పేజీ తరువాయి)

మండలాల వారీగా కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన వారందరికి రేషన్‌కార్డుల పంపిణీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్ ఆధ్వర్యంలో రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ జరగ నున్నది. ఈ సంవత్సరం జనవరి 1 నాటి లెక్కల ప్రకా రం జిల్లాలో 2,76,895 రేషన్‌కార్డులు ఉండగా అందు లో 8,04,498 మంది సభ్యులుగా నమోదై ఉన్నారు. ప్రజాపాలన, ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ అనంతరం కొత్తగా జారీ చేసిన కార్డులను కలుపుకుని ఈ నెల 21 వరకు జిల్లాలో రేషన్‌కార్డుల సంఖ్య 3,11,334కు చేరింది. పాత కార్డుల్లో కొత్త సభ్యులను కూడా చేర్చారు. దీంతో ప్రస్తుతం ఆయా కార్డుల్లో ఉన్నవారి సంఖ్య 9,29,525 మందికి చేరింది. ఇంకా కార్డులు మంజూరు కావాల్సి ఉన్నది. రేషన్‌కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ కాబట్టి కొత్తగా వచ్చినవారు, ఇప్పటికీ దరఖాస్తులు చేసుకోనివారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునేందుకు వీలుందని ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకటించారు. ప్రస్తుతం జిల్లాలో ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా 34,439 కొత్త కార్డులు పంపిణీ కానున్నాయి. సుమారు 47,120 మంది కొత్తగా రేషన్‌కార్డుల్లో సభ్యులుగా చేరారు. వీరందరికి సెప్టెంబరు నుంచి సరుకులు మంజూరు కానున్నాయి. కొత్త రేషన్‌కార్డుల పొందినవారు తమ సమీపంలోని రేషన్ షాపుకు వెళ్లి రేషన్ పొందవచ్చు.

● ఫటాఫట్..

గంజాయి నియంత్రణకు చర్యలు

- జాన్‌రెడ్డి, కరీంనగర్ త్రీటౌన్ సీఐ



ఆంధ్రజ్యోతి: త్రీ టౌన్ పరిధిలో గంజాయి కట్టడికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: త్రీటౌన్ పరిధిలోని మాస్ ఏరియా, అనుమానిత ప్రాంతాల్లో నార్కోటిక్ ఎక్స్‌పర్ట్ డాగ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ హాస్టళ్లు, పాన్‌టేలాలు, కిరాణం షాపుల్లో తనిఖీ చేపడుతున్నాం. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా పెట్టాలి. యువత, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

ఆంధ్రజ్యోతి: శాంతిభద్రతలపై తీసుకుంటున్న చర్యలేమిటి?

సీఐ: ప్రతీ కాలనీలో 24 గంటలపాటు బ్లూకోల్ట్స్, రాత్రి సమయంలో పోలీస్ పార్టీ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. అనుమానితులు తారసపడితే ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో పరిశీలిస్తున్నాం. బహిరంగ మద్యం, డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. రోడ్లమీద బర్త్‌డే వేడుకలపై కఠినంగా వ్యవహరిస్తాం. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

- కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

హుజూరాబాద్‌లో డయోగ్నోస్టిక్స్ మాయాజాలం

● అర్హతలేని వారితో ల్యాబ్‌ల నిర్వహణ
● రోగులకు అనవసరమైన పరీక్షలు

హుజూరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్‌లో డయోగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ప్రజల అనారోగ్యాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పాథాలజిస్టులు, రేడియాలజిస్టులు లేకుండానే ల్యాబ్‌లు నడిపిస్తున్నారు. వైద్యులు అనవసరమైన పరీక్షలు రాసి కమీషన్లు దండుకుంటున్నారు. జిల్లా వైద్యశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. హుజూరాబాద్ డివిజన్‌లో కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌లను పాథాలజిస్టులు లేకుండానే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కనీసం యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్, ప్లేట్‌లేట్ కౌంట్, తెమడ వంటివి పరీక్ష చేయడానికి కూడా పాథాలజిస్టులు లేరు. వారికి బదులు ఇంటర్ పూర్తి చేయని వారితో పరీక్షలు చేయిస్తున్నారు. వారు ఇచ్చిన రిపోర్టులను చూసి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఒక ల్యాబ్‌లో చేసిన రిపోర్టుకు, మరో ల్యాబ్ చేసిన రిపోర్టుకు చాలా తేడాలు కనిపిస్తున్నాయని, కొంతమంది అవగాహన రాహిత్యంతో తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని రోగులు విమర్శిస్తున్నారు. స్కానింగ్‌లు సైతం చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణ లున్నాయి. బినామీ పేర్లతో సైతం డయాగ్నోస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేసి యథేచ్ఛగా పని కానిస్తున్నారు. రేడియాలజిస్టు లేదా పాథాలజిస్టు సంతకం కావాలంటే ఫోర్జరీ చేసి ఇస్తున్నారు. కమీషన్ల కోసం గర్భిణులకు ఉమ్మనీరు తగ్గకున్నా తగ్గినట్లుగా నివేదికలు ఇస్తూ మళ్లీమళ్లీ స్కానింగ్‌లు చేయిస్తున్నారు. జిల్లా వైద్యాధికారులు డయాగ్నోస్టిక్ సెంటర్లపై తనిఖీలు చేయాలని పలువురు కోరుతున్నారు.

మెదడుపై ఒత్తిడి తగ్గించుకోవాలి



హెల్త్‌టాక్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మెదడుపై ఒత్తిడి తగ్గించాలని, అప్పుడే చురుగ్గా ఉంటుందని కరీంనగర్ మెడికవర్ వైద్యులు అన్నారు. మంగళవారం ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో మెదడు సంబంధిత వ్యాధులపై హెల్త్‌టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. ఏడుగంటలు నిద్రపోవాలని, రోజు వ్యాయామం చేయాలని సూచించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, న్యూరోసర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శివనాగప్రసాద్, నారాయణ, బసవేశ్వర్, విజ్ఞాన్‌రావు, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్,సంతోష్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఈటలకు లేదు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఈటల రాజేందర్‌కు లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్ పెద్ద మోసగాడని, టికెట్ ఇచ్చి అన్నం పెట్టిన కేసీఆర్‌తోపాటు హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని అన్నారు. కేసీఆర్ భిక్షతోనే ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పదవులు పొంది, ఇప్పుడు కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గు చేటన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించి తీరుతానన్నారు. సమావేశంలో బండ శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



మొక్క నాటి నీరు పోస్తున్న సీపీ గౌస్ ఆలం

భగత్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన ప్రపంచం కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్(సీబీఎస్‌ఈ) పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవంలో మాట్లాడారు. మానవుల మనుగడకు చెట్లు ముఖ్యమన్నారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, మాదక ద్రవ్యాల నిరోధక శాఖ సీఐ పుల్లయ్య, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలత, సైబర్ క్రైం ఎస్సై శ్రీనివాస్, కొత్తపల్లి ఎస్సై సంజీవ్, పాఠశాల ప్రిన్సిపాల్ భార్గవ్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,జూలై22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ, పంజాల శ్రీనివాస్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్‌నగర్, శివాజీనగర్, ఎస్సీ కాలనీ, కిసాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

మత్తడి దూకుతున్న మోయతుమ్మెద వాగు



చిగురుమామిడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముది మాణిక్యం గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు మత్తడి దూకుతోంది. హుస్నాబాద్ ఎగువ మండలాల నుంచి వచ్చిన భారీ వరదకు మత్తడి దూకుతోందని రైతులు పేర్కొన్నారు. అనంతరం వర్షాలు సమృద్ధిగా పడాలని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

20వేల సైకిళ్లను అందించడం గొప్ప విషయం



సైకిళ్లను అందజేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

ఇల్లందకుంట/వీణవంక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వపాఠశాలల్లో 20వేల మంది పదోతరగతి విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సైకిళ్లను అందజేయడం గొప్ప విషయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఇల్లందకుంట మండల కేంద్రం, వీణవంక మండలం చల్లూరు పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మోదీ కానుకగా బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగాసైకిళ్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఎంఈవో రాములు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కటంగూరి అనిల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

ఖర్గేకు సిరాజ్ హుస్సేన్ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్

కరీంనగర్ అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ ఢిల్లీలోని రాజాజీ మార్గ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిరాజ్‌హుస్సేన్ మాట్లాడుతూ ఖర్గే ఆధ్వర్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవడం ఖాయమని సిరాజ్ హుస్సేన్ పేర్కొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

భగత్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మహిళలను అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని జిల్లాలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిన్నెర మల్లవ్వ, గరిగె శారద పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎన్ఎఫ్‌ఐడబ్ల్యూ కరీంనగర్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమాజంలో రానున్న రోజుల్లో మహిళలే కీలకం కానున్నారన్నారు.

అచ్యుతానందన్ స్ఫూర్తితో ఉద్యమించాలి

భగత్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో అచ్యుతానందన్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు

జమ్మికుంట రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ఈనెల24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్‌సైన్స్ 1, డెయిరీసైన్స్ 1, క్రాప్ ప్రొడక్షన్ 1, బోటని 1, ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులు నేరుగా కళాశాలలో ఉదయం 11గంటలకు హాజరుకావాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్ అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంద మహేందర్, సర్దార్ని దర్శన్ కౌర్, అస్మా సుల్తానా, మహ్మద్ యూసుఫ్, షమీనా బేగం, గాజుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ మాధవికి వెలిచాల రాజేందర్‌రావు పరామర్శ

కరీంనగర్ క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ మాధవిని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం పరామర్శించారు. ఆమె భర్త కరీంనగర్ పీటీసీ డీఎస్పీగా పనిచేస్తున్న మహేష్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. పరామర్శించినవారిలో మాజీ కార్పొరేటర్‌లు, కాంగ్రెస్‌నాయకులు ఉన్నారు.

అకౌంట్స్ అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు అభినందనలు

కరీంనగర్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అకౌంట్స్ అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా బాధ్యతలు స్వీకరించిన త్రినాథ్ దత్తును మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ మంగళవారం అభినందనలు తెలిపారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు ఆయనను కలిశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

కరీంనగర్ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్ పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను మంగళవారం మాజీ మేయర్ సునీల్‌రావు పరిశీలించారు. పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొలకాని నర్సయ్య, పండుగ నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

అసలు సిసలైన తెలంగాణ కవి దాశరథి

కరీంనగర్ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అసలు సిసలైన తెలంగాణ కవి దాశరథి కృష్ణమాచార్యులని తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు అన్నారు. మంగళవారం దాశరథి శత జయంతి సందర్భంగా రేకుర్తిలో సంస్థ జిల్లా కార్యదర్శి మానువాడ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దాశరథి రచనలు నేటి కాలంలోనూ ప్రభావితం చేసేలా ఉంటాయన్నారు. సమావేశంలో ఆడెపు రామనారాయణ, పురుషోత్తం సతీశ్, వనజ, గిరిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీపీవో దిష్టిబొమ్మ దహనం

శంకరపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద టీజేఎస్, సీపీఐ ఆధ్వర్యంలో డీపీవో దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరె గణేష్, సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ మొలంగూర్ గ్రామశివారులోని సర్వే నంబర్ 703లోని ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, తహసీల్దార్ విచారణ చేపట్టారని, జిల్లా పంచాయతీ అధికారి 20రోజులుగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.

దాశరథి శత జయంతి వేడుకలు

కరీంనగర్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం దాశరథి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బైర్ల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ మాలతి పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో దాశరథికి నివాళులు అర్పించారు. .

రౌడీ షీటర్లపై నిఘా పెట్టాలి

హుజూరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని అడిషనల్ డీసీపీ భీమ్‌రావు అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. టౌన్‌సీఐ కరుణాకర్, ఎస్సైలు యూనస్ అహ్మద్ అలీ, రాధాకిషన్ పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయం

గణేశ్‌నగర్,జూలై 22(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం సింగాపూర్‌కు చెందిన నీరటి రిషి అనే నిరుపేద విద్యార్థికి 1990-94 హన్మకొండ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల బృందం రూ.80 వేల నగదును మంగళవారం అందించింది. రిషి వరంగల్ నిట్ కలశాలలో ఈసీఈ విభాగంలో సీటు సాధించాడు. కళాశాలలో చేరేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతలు, పూర్వ విద్యార్థులు నగదును సేకరించారు. కరీంనగర్ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న 1990-94 పూర్వ విద్యార్థి బండ శ్రీనివాస్ ద్వారా అందించారు.

ఘనంగా జాతీయ జెండా ఆమోద దినోత్సవం



వేడుకల్లో కోరా, జాన్సన్ ఏఎన్‌సీ విద్యార్థులు

సుభాష్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డే సందర్భంగా మంగళవారం లయన్స్‌క్లబ్-320జీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి టవర్‌సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. కరీంనగర్ ఆర్‌డీవో మహేశ్వర్ ర్యాలీని ప్రారంభించారు.

గణేశ్‌నగర్: నగరంలోని కోరాజాన్సన్, ఏఎన్‌సీ పాఠశాలల్లో జాతీయ జెండా ఆమోద దినోత్సవాన్ని చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి ప్రారంభించారు.

రామడుగు : మండలంలోని గోపాల్‌రావుపేటలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీప్రగతి హైస్కూల్ విద్యార్థులు 100మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ తీశారు. క్లబ్ మైక్రో క్యాబినెట్ మెంబర్ గోలి మధుసూదన్‌రెడ్డి, క్యాబినెట్ మెంబర్ శ్యాంసుందర్ రెడ్డి, డైరెక్టర్ పబ్బతి మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

గన్నేరువరం: లయన్స్‌క్లబ్ ఆఫ్ గన్నేరువరం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూర శ్రీనివాస్ జెండాపై వివరించారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్ మీదుగా మొగ్దుంపూర్ వరకు ఉన్న పది కిలోమీటర్ల రామగుండం బైపాస్ రోడ్డులో ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు ప్రకటనలో మండిపడ్డారు.

కరీంనగర్ కల్చరల్: స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో మంగళవారం జిల్లా గోరక్షా టోలీ సమావేశం నిర్వహించారు.

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పెట్టెం నవీన్ తెలంగాణ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్‌గా నియమించారు.నవీన్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు.

గన్నేరువరం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు.

- మండల డిప్యూటీ తహసీల్దారుగా ప్రణీత్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు.

భగత్‌నగర్: తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా కసిబోజుల సంతోషచారి ఎన్నికయ్యారు.

- కృషి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేకుర్తి, ఎస్‌యూ రోడ్‌లో మొక్కలు నాటారు.

గణేశ్‌నగర్: యూజీసీ-నెట్‌లో కరీంనగర్‌కు చెందిన అంధ విద్యార్థి లక్కీమిరానీ ప్రతిభ కనబరిచాడు. మొదటి ప్రయత్నంలోనే యూజీసీ-నెట్ పరీక్షలో 93.59 శాతం మార్కులు సాధించాడు.

కరీంనగర్ క్రైం :కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ బీసీ హాస్టల్‌లో కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.

గంగాధర: మండలం కురిక్యాల, కొండన్నపల్లి గ్రామాల్లో జాతీయ గణాంకశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.

చొప్పదండి: చొప్పదండి మండల రజక సంఘం అధ్యక్షుడిగా మావురం రాములు నియామకమయ్యారు.

- మండలంలోని మల్లన్నపల్లిలో పల్లెపల్లెకు కాంగ్రెస్ జెండా కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిగురుమామిడి: కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, జడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు వార్డులను సందర్శించారు.

ఇల్లందకుంట: హైదరాబాద్‌లో నిర్వహించే చలో గన్‌పార్క్ కార్యక్రమానికి ఇల్లందకుంట, కమలాపూర్, వీణవంక, జమ్మికుంట మండలాల నుంచి తెలంగాణ ఉద్యమకారులు భారీగా తరలివెళ్లారు.

అత్యాచార నిందితుడిని ఉరితీయాలి

గణేశ్‌నగర్,జూలై 22(ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినిని అత్యాచారం చేసిన నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని సంఘం జిల్లా కన్వీనర్ విష్ణు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గీత భవన్ చౌరస్తా వద్ద నిందితుడి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ నాయకుల తీరుపై రాహుల్ గాంధీ నోరు విప్పాలన్నారు.

పోటీ ప్రపంచంలో బాలికలు రాణించాలి

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో బాలికలు రాణించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల ఆవరణలో లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్‌ల సంయుక్తంగా జాతీయ పతాక ఆమోద దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1947 జూలై 22న నాటి భారత రాజ్యాంగ సభ మన జెండాను ఆమోదించడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిందన్నారు.

బావిలోపడిన నక్క.. రక్షించిన అటవీశాఖ అధికారులు

కరీంనగర్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లోని బోనాల లక్ష్మయ్యకు చెందిన వ్యవసాయ బావిలో మంగళవారం సాయంత్రం చీకటిపడే సమయంలో నక్క ప్రమాదవశాత్తు పడింది. రైతు సమాచారంతో అక్కడికి చేరుకున్న అధికారులు వలలతో బావిలో నుంచి నక్కను క్షేమంగా బయటకు తీశారు. అటవీశాఖ డిప్యూటీ రేంజి ఆఫీసర్ నర్సింగరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్, ప్రవీణ్, సర్వర్, సత్యం జంతు సంరక్షణ సంస్థ ప్రతినిధి, ఎనిమల్ రెస్క్యూ పర్సన్ సుమన్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్/గణేశ్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదినం సందర్భంగా నగర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేశారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, కొత్తపెల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమర్‌గౌడ్ వేంకటేశ్వరాలయంలో పూజలు చేశారు.

బీఆర్‌ఎస్ నాయకుడు జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. రైతు, ప్రజా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పోలాడి రామారావు కేక్ కట్ చేశారు శాతవాహన యూనివర్సిటీ బీఆర్‌ఎస్వీ ఇన్‌చార్జి శ్రీనివాస్ యూనివర్సిటీలో వేడుకలను నిర్వహించారు.

తిమ్మాపూర్/గన్నేరువరం/హుజూరాబాద్/మానకొండూర్/రామడుగు: తిమ్మాపూర్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఉల్లెంగుల ఏకనందం, రావుల రమేష్, గన్నేరువరంలో మండల అధ్యక్షుడు గంప వెంకన్న, హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. మానకొండూర్ మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్ గౌడ్ కేక్ కట్ చేశారు. రామడుగు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేత నాగిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.